

# అవును....నేను తప్పు చేశాను.

ఆరోజంతా అన్నం సహించలేదు. మనసంతా గజిబిజిగా తయారైంది. దేని మీదా మనసును లగ్నం చేయలేకపోతున్నాను. నిజంగా నేను తప్పు చేశానో లేదో అర్థం కాని పరిస్థితి. నేనేమితప్పు చేయలేదని నాకనిపిస్తుంది. కాని అసలు జరిగిన విషయాన్ని వివరించే అవకాశమే రాలేదు. ఒకటే మాట 'నువ్వు తప్పు చేశావు' అంతే. తొలిసారిగా దోషిగా నిలబడ్డాను. చాలా బాధ అనిపించింది.

ఆ రోజు...ఆఫీస్‌లో ఇన్‌స్పెక్షన్. హెడ్ ఆఫీస్ నుంచి ఒక బృందం వచ్చింది. ఇన్‌స్పెక్షన్ జరుగుతుందని వారం రోజుల ముందే అందరికీ తెలుసు. అందరూ అవసరమైన సమాచారంతో సంసిద్ధంగా వుండాలని ముందుగావే వర్తమానాలందాయి. నేను కూడా ఫైల్స్ అన్నీ సిద్దం చేసి వుంచాను. గత ఆరు నెలల్లో జరిగిన ప్రోగ్రస్ పై ఒక రిపోర్టు కూడా రెడీ చేశాను. ప్రతి అంశం పైనా బ్రీఫ్ నోట్స్ కూడా వ్రాశాను. ఒక రోజు ముందే నేను రెడీ కావడంతో హ్యాపీగా వున్నాను. ఆరోజు...ఇన్‌స్పెక్షన్ రోజు..ఆఫీష్‌కెళ్ళేందుకు రెడీ అవుతున్నాను. ఆరోజు నన్ను అర్థ గంటముందే ఆఫీస్ వద్ద దింపమని మావారు ప్రశాంత్ తో చెప్పాను.

ఇద్దరం రెడీ అయి స్కూటర్ పై బయలుదేరే సమయంలో ఫోన్ మ్రోగింది. ప్రశాంత్ గబగబలో పలికి వచ్చి రెండు క్షణాల తర్వాత "ఏమోయ్...నీకే ఫోను..."అన్నారు. ఆఫీస్‌కు బయలుదేరుతున్న సమయంలో మళ్ళీ వెనక్కు రావడం చికాకనిపించింది. లోపలికి వచ్చి రిసీవర్ అందుకున్నాను.

"హలో...హలో...నేను...సుజాతను"అవతలి గొంతు కంగారుగా వినిపించింది.

"ఏంటి సుజాత!! ఏమైంది?"అని అడిగాను

"నువ్వు అర్జంటుగా రావాలి"

"ఎందుకు"

"ముందురా చెప్తాను"

"అదికాదే...నేనిప్పుడు ఆఫీస్‌కి బయల్దేరుతున్నా..సంగతేంటో చెప్పు"అన్నాను.

"నువొక్కసారి అర్జంట్‌గా వచ్చి వెళ్ళు" అనేసి సుజాత ఫోన్ పెట్టేసింది. నాకేం చేయాలో పాలు పోలేదు. వెళ్ళకపోతే బాగుండదు. కాని ఈరోజు ఆఫీస్‌లో ఇన్‌స్పెక్షన్! ఎటూ తెల్చుకోలేక రెండు క్షణాలు సతమతమయ్యాను.

నన్ను గమనిస్తున్న మా వారు "పోనీ సుజాత ఇంటికి ఆటోలో వెళ్ళిపో. అటునుంచి అదే ఆటోలో ఆఫీస్‌కి వెళ్ళిపోవచ్చు. ఇంకా అరగంట టైముందిగా"అన్నారు.

నాకూ అదే సబబనిపించింది.

ప్రశాంత్ వెళ్ళపోయాడు. ఆయన క్యాంప్ వెళ్ళే హడావిడిలో వున్నారు. లేకపోతే తానే నన్ను సుజాత ఇంటి దగ్గర దించి వుండేవారు.

సుజాత నా క్లాస్‌మేట్. క్లోజ్‌ఫ్రెండ్. నాలాగే ఒక ప్రయివేటు కంపెనీలో ఉద్యగం చేస్తోంది. ఇంకా పెళ్ళి కాలేదు. అక్కబావలతో కలసి వుంటోంది. నేను ఆటోలో సుజాత ఇంటికి చేరాను.

గుమ్మంలోనే సుజాత ఎదురైంది. చాల ఆందోళనగా వుంది. నేను 'ఏం జరిగిందని' అడిగేలోపే నా చెయ్యి పట్టుకొని గబగబ లోపలికి తీసుకెళ్ళి "అక్కకి నొప్పులు వస్తున్నాయి. సమయానికి ఇంట్లో ఎవరూ లేరు. ఏం చేయాలో తెలీక నీకు ఫోన్ చేశాను." అంది.

నేను వెంటనే నాకు తెలిసిన డాక్టర్‌కు ఫోన్ చేశాను. ఆవిడ వెంటనే అంబులెన్స్‌ను, నర్సును పంపిస్తున్నానని చెప్పారు.

"మీ బావగారు, అమ్మ ఏమయ్యారు?" అని అడిగాను.

మా చుట్టాలబ్బాయి పెళ్ళికి ఊరెళ్ళారు. రాత్రే వచ్చేయవలసింది. కాని ఆ ఊరి చివర ఏదో గొడవ జరిగిందట. బస్సులు నడవడ్డం లేదట. మధ్యాహ్నం నుంచి బయలుదేరి ఎలాగైనా సాయంత్రానికల్లా వచ్చేస్తామని ఫోన్ చేశారు. ఆ తర్వాత పెయిన్స్ 'మొదలయ్యాయి' అని చెప్పింది సుజాత. నేను డాక్టర్‌కు ఫోన్ చేశాక సుజాత కాస్త స్థిమితపడింది.

"పోని రెగ్యులర్‌గా మీ అక్కని చెకప్ చేసే డాక్టర్ని ఫోన్ చెయలేకపోయావా??"అడిగాను.

"ముందు ఆవిడకే చేశాను. ఆవిడ ఇంట్లోలేదు. ఎప్పుడొస్తారో తెలీదని చెప్పారు" అంది సుజాత.

పది నిమిషాల్లో అంబులెన్స్ రావడంతో సుజాత అక్కను అందరలో ఎక్కించి, నేను, సుజాత హాస్పిటల్‌కు చేరాం. డాక్టర్ ఆమెను పరీక్ష చేసి సిజేరియన్ తప్పని సరని చెప్పారు. ఆపరేషన్ అనగానే సుజాతకు దుఃఖం ఆగలేదు.

"అవునూ డెలివరి డేట్స్ మీకు తెలియవా?"అని అడిగానుసుజాతని.

"డాక్టర్ ఇంకో రెండు వారాల తర్వాతని చెప్పారు' చెప్పింది సుజాత.

ఆపరేషన్ చాల కష్టమైంది. బిడ్డ దక్కలేదు. సుజాతను ఓదార్చడం నా వల్ల కాలేదు. చాలా సేపు ఇబ్బంది పడ్డాను. ఆ రోజంతా హాస్పిటల్లో వుండిపోవలసి వచ్చింది. సాయంత్రానికి సుజాత అమ్మ, బావగారు రావడంతో నేను ఇంటికి వచ్చేశాను.

'ఆపీస్ లో ఇన్‌స్పెక్షన్ ఏమైందో! నేను అబ్సెంట్ అయ్యానని మేనేజర్‌కు కోపం వచ్చివుంటుంది. రేపు వెళ్ళగానే జరిగిందంతా చెప్పాలి.' అనుకున్నాను.

మర్నాడు యధావిధిగా ఆఫీస్‌కు వెళ్ళాను. లోపలికి వెళ్ళగానే,

"నివ్వు ఎక్కడికి పోయావ్? ఎ.జి.ఎం. మండిపడుతున్నాడు. వెళ్ళి కనిపించు."అని చెప్పింది కొలీగ్,

అది నేను ముందుగానే ఊహించడం వల్ల మెంటల్‌గా ప్రిపేర్ అయి ఎ.జి.ఎం ఛాంబర్‌లోకి వెళ్ళాను.

మా ఎ.జి.ఎం ఎంత కోపమొచ్చినా కూల్‌గా మాట్లాడతారు. కాని ఆమాటలు పదునుగా వుంటాయి. ఇన్‌స్పెక్షన్ రోజు రాలేక పోవడానికి కారణం క్లుప్తంగా చెప్పాను. ఆయన విన్నారు.

చివరికి "నీ ఎక్స్‌ప్లనేషన్‌ను నేను యాక్సెప్ట్ చేయను. కనీసం నువ్వు ఉదయాన్నే ఈ విషయాన్ని ఇన్‌ఫాం చేసి వుండాల్సింది. డ్యూటీ పట్ల, దట్‌టూ చాలా ఇంపార్టెంట్ అయిన ఇన్‌స్పెక్షన్ రోజున నువ్వు ఇర్రెస్పాన్సిబుల్‌గా బిహేవ్ చేశావు. అది క్షమార్హం కాదు. నీ వల్ల నాకు, మనాఫీసుకు బ్యాడ్ రిమార్క్ వచ్చింది. నీమీద నమ్మకంతో విలువైన బాధ్యతను అప్పగిస్తే నిర్లక్ష్యంగా ప్రవర్తించావు."అని మెత్తగా చివాట్లేశాడు.

ఎ.జి.ఎం కు నాపై వున్న సదభిప్రాయం కాస్తా ఇలా మంట కలిసిపోయినందుకు నన్ను నేను నిందించుకున్నాను. కాని ఇది నేను ఇంటెన్షనల్‌గా చేసింది కాదు. అయినా నేను తప్పు చేసినట్టు వేలెత్తి చూపడం చాలా బాధనిపించింది.

ఇలా ఆలోచిస్తూ ఉండగానే మావారు ప్రశాంత్ ఆఫీస్ నుంచి వచ్చారు.

"ఏంటోయ్ చీకట్లో వున్నావ్. లైట్ వేసుకో లేదే?" అని లైటేసి నావంక చూశారు.

"ఎనీ ప్రాబ్లం?"అని అడిగారు.

నేను ఆఫీస్‌లో జరిగిన విషయాన్ని ఎ.జి.ఎం మాటల్ని చెప్పాను.

"ఇన్‌స్పెక్షన్ రోజున నేను కావాలని ఉద్దేశ్యపూర్వకంగా ఆఫీస్ ఎగ్గొట్టలేదే?"అన్నాను.

రెండు నిముషాల తర్వాత ప్రశాంత్ అన్నారు. "చూడు డియర్. ఖచ్చితంగా చెప్పాలంటే, నువ్వు చేసింది తప్పే. ఎవరూ సరిదిద్దలేని తప్పు ఉద్యోగ బాధ్యతల్లో సెంటిమెంట్‌కు స్థానం లేదు. నీ అబ్సెన్స్ వల్ల మీ ఆఫీస్‌కు చెడ్డ పేరు వచ్చింది.

ఇన్‌స్పెక్షన్‌కు వచ్చిన స్క్వాడ్ నీగురించి అడిగితే మీ ఎ.జి.ఎం ఏమని సమాధానం చెప్తారు? నిన్నెలా సమర్థిస్తారు? నువ్వు చేసిన పని వల్ల ఆయనకు రిమార్క్ వచ్చి వుంటుంది. అందుకు బహుశా ఆయన నైతిక బాధ్యత వహించి వుంటారు.

"కాని అలా ఎందుకు..."అని నేనోదో చెప్పబోతుంటే ప్రశాంత్ అడ్డుతగిలి.

"అదే తప్పు..అసలేం జరిగింది? అలా ఎందుకు జరిగింది. అనే పోస్ట్‌మార్టం ప్రశ్నలు అప్రస్తుతం.. చాలా కీలకమైన రోజు ఇన్‌స్పెక్షన్ నాడు నువ్వు ఆఫీస్‌కు హాజరుకాలేదు అంటే నీ విధి నిర్వహణ జరగలేదు. దానికి నువ్వు బాధ్యత వహించాలి."

నేను ఆలోచనలో పడ్డాను. రెండు క్షణాలు తర్వాత ప్రశాంత్ మళ్ళీ అన్నాడు. "కేవలం ఉద్యోగంలోనే కాదు జీవితంలో కూడా సమయం ఎంతో ముఖ్యమైనది. ఏదైనా ఇన్‌టైంలో జరగాలి. నువ్వు రావడం లేటయ్యింది. రైలు ఆగిపోతుందా? చెప్పు! ఇంగ్లీష్‌లో 'లేట్' అనే పదానికి రెండు అర్థాలున్నాయి. ఒకటి 'ఆలస్యం'అని, రెండవది 'చనిపోవడం' అని. అంటే ఆలస్యం జరిగితే జీవం కోల్పోయినట్టే. అందుకే 'లేట్' వుండకూడదు.

"నేను సుజాత ఇంటికి వెళ్ళడం...."అని నేను చెప్పబోతుంటే ప్రశాంత్ మళ్ళీ అడ్డుపడ్డాడు.

"చూడు డియర్ నువ్వు ఇంకా కేవలం నీ దృష్టితోనే ఆలోచిస్తున్నావు. అది తప్పు. ఉద్యోగం వ్యక్తిగతం కాదు. సమిష్టి బాధ్యత. అందులో ఏ ఒక్కరు సరిగా నడుచుకోలేక పోయినా మొత్తం ఆఫీస్‌కే చెడ్డ పేరు వస్తుంది. నీకో చిన్న ఉదాహరణ చెబుతాను విను. ఒక రైలు ప్రమాదం జరిగి కొంత మంది చనిపోతే, అప్పుడు రైల్వే మంత్రిగా వున్న లాల్ బహుదూర్ శాస్త్రి తన పదవికి రాజీనామా చేశారు. నిజానికి ఆ రైలు ప్రమాదానికి, లాల్ బహుదూర్ శాస్త్రికు ఎటువంటి ప్రత్యక్ష సంబంధం లేదు. కేవలం నైతిక బాధ్యత. ఉద్యోగ ధర్మంలో వివరణలకు, వాదనలకు స్థానం లేదు. నీ ధర్మాన్ని నువ్వు తు.చ.తప్పక పాటించాల్సిందే. సుజాతతో పాటు నువ్వు హాస్పటల్‌కు వెళ్ళగానే ఆఫీస్‌కు ఫోన్ చేసి జరిగింది చెప్పి వుండాల్సింది. లేదా ఒకసారి ఆఫీస్‌కు వెళ్ళి నీ సెక్షన్ ఫైల్స్ ఇతర వివరాల్ని ఎ.జి.ఎంకు అందచేసి పర్మిషన్ తీసుకొని వుండాల్సింది. కాని నువ్వు పూర్తిగా ఆఫీస్ సంగతే మరచిపోయావు. అక్కడే నువ్వు మళ్ళీ తప్పు చేశావు." అనేసి బట్టలు మార్చుకునేందుకు లోపలికి వెళ్ళిపోయాడు ప్రశాంత్.

చాలాసేపు ఆలోచించాక నేను చేసిన తప్పేమిటో తెలిసివచ్చింది. 'అవును నేను తప్పు చేశాను'

– "మోతిలాస్య"

